## బాధిత కుటుంబాలకు బీమా చెక్కులు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఏజీఎం శ్రీధర్‌రెడ్డి

తిమ్మాజిపేట, మే 3: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు పలు రకాల సేవలను అందిస్తున్నామని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఆవంచలో బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ ద్వారా బీమా చేసి, ప్రమాదవశాత్తు మృతిచెందిన కుటుంబాలకు చెక్కులను అందజేశారు. అమ్మపల్లికి చెందిన నర్సింహులు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ పథకంలో చేరి, ప్రమాదవశాత్తు మృతిచెందడంతో ఆయన కుటుంబానికి రూ.20 లక్షల బీమా పరిహారం రావడంతో, చెక్కును కుటుంబసభ్యులకు అందజేశారు. దీంతోపాటు ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమాలో భాగంగా ప్రమాదవశాత్తు మృతిచెందిన పెద్దమల్లయ్య, లక్ష్మయ్య, వెంకటయ్య, శంకర్‌జీ కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలను, సామాజిక భద్రత పథకాలను అందిస్తున్నామన్నారు. బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకుని, సకాలంలో రుణాలు చెల్లించి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధికారి రంజిత్ కుమార్, బ్రాంచ్‌మేనేజర్ సునీల్ కుమార్, అధికారులు అశోక్ యాదవ్, హరీశ్, వెంకటేశ్, మిథున్, సురేష్‌రెడ్డి, నరేశ్, శివ ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ గ్రానైట్ తవ్వకాలను అడ్డుకుంటాం



ఆర్డీవో శ్రీనుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

చారకొండ, మే 3: మండలంలోని సిరుసనగండ్ల గ్రామ శివారులో 182 సర్వే నెంబర్‌లో బ్లాక్ గ్రానైట్ తవ్వకాలు చేపడితే అడ్డుకుంటామని, ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని మాజీ ఉపసర్పంచ్ పశుల శ్రీను, మాదిగ జాగృతి జిల్లా నేత విజయ్, నాయకులు ఈర్లపల్లి శ్రీను, తిరుమలేశ్‌నాయక్, సురేశ్ డిమాండ్ చేశారు. శనివారం బ్లాక్ గ్రానైట్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని కోరుతూ.. ఆర్డీవో శ్రీను, కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ మునిర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్లాక్ గ్రానైట్ తవ్వకంతో పరిసరా ప్రాంతాల్లో వ్యవసాయ పంటలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. గ్రామస్తులకు, రైతులకు ఏలాంటి సమాచారం ఇవ్వకుండానే తవ్వకాలు చేపట్టడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బ్లాక్ గ్రానైట్ అనుమతులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలి

- బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్



విద్యార్థులను సన్మానిస్తున్న కొమ్ము శ్రీనివాస్

వంగూరు మే3: 'పది'లో మెరిట్ సాధించిన విద్యార్థులు ఇదే ప్రతిభతో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని బీఆర్‌ఎస్ నేత, తెలంగాణ బీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ కోరారు. మండలంలోని గాజర ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని పదిలో మంచి మెరిట్ సాధించిన కార్తీక్, తేజస్విని, లిప్సిక, భాషినిని శనివారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే ఉన్నత స్థానానికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. క్రమశిక్షణతో చదువుకున్న ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో రాణించగలరన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వశీం, గ్రామ పెద్దలు మల్లయ్య, గణేశ్, రాజయ్య, సహోదర్, శ్రీను, కృష్ణయ్య, శ్రీను, మోగులాల్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి వెంకటేశ్‌కు సన్మానం



విద్యార్థి వెంకటేశ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కొల్లాపూర్ రూరల్, మే 3: 'పది' పరీక్షలో 572 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో ర్యాంక్ దక్కించుకున్న పట్టణంలోని జిల్లా పరిషత్ గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలకు చెందిన వెంకటేశ్‌ను కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, డీఈవో రమేశ్ కలెక్టరేట్‌లో శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలో మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు అర్జున్ గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**LONG TERM COACHING**

★ BiPC-NEET & MPC-IIT Long Term Coaching Start on June, 1st , SRI CHAITANYA JR. COLLEGE, Hyd. Contact. K. ASHOK REDDY, A.O., Cell:9441884705

NT-MBNR

**ప్లాటు విక్రయము**

★ మహబూబ్‌నగర్, శ్రీనివాస్ కాలనీలో 30 ఫీట్ల రోడుకు 35 x 46, 187 చ.గజముల ప్లాటు East Fase కలదు. మరియు 40ఫీట్లకు 41 x 45, 201 చ.గజముల ప్లాటు Wast Fase కలదు. వివరాలకు సంప్రదించండి 9700018107·

NT-MBNR

**FINANCIAL SERVICES**

★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.

NT-336491-All

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

# చోరీ కేసులో దొంగల అరెస్ట్..

- రూ. 2, 40 లక్షల నగదు, కారు, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ నాగార్జున




వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగార్జున

కల్వకుర్తి రూరల్, మే 3: మండలంలోని తుర్కలపల్లిలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని సీఐ కార్యాలయంలో సీఐ నాగార్జున చోరీకి పాల్పడిన వారి వివరాలు వెల్లడించారు. ఊర్కొండ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమ్మి యాదగిరి, గోవిందుశివకుమార్, కల్వకుర్తి మున్సిపాలిటీ సంజాపూర్‌కుచెందిన బెల్లె శ్రీరాం గత నెల 21న మండలంలోని తుర్కలపల్లిలో సాయిలు ఇంట్లో రూ. ఐదు లక్షల నగదు అదేవిధంగా గత నెల 14న కల్వకుర్తి పట్టణం మార్గదర్శి కాలనీలో తిర్పతయ్య ఇంట్లో రూ.60వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకుని దర్యాప్తు ప్రారంభించగా శనివారం కల్వకుర్తి పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీచేస్తుండగా యాదగిరి, శివకుమార్, శ్రీరామ్ అనుమానాస్పదంగా ఉండడంతో వారిని పట్టుకుని విచారించగా నేరాలను అంగీకరించారు. వారి నుంచి రూ. రెండులక్షల నలభై వేల నగదు, స్విఫ్ట్ కారు, జనగామ జిల్లాలో వీరు దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. వీరిలో కొమ్మి యాదగిరి గతంలో ఉమ్మడి జిల్లాలో పలు చోరీలకు పాల్పడి జైలు శిక్షను అనుభవించాడని తిరిగి మళ్లీ అతడు నేర ప్రవృత్తిని కొనసాగిస్తున్నాడని సీఐ తెలిపాడు. కేసు అత్యంత వేగం ఛేదించడానికి కృషి చేసిన ఎస్సై మాధవ రెడ్డి, పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. పట్టణ రెండవ ఎస్సై రాంచెందర్‌జీ, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నిబంధన ప్రకారం దవాఖానను నడపాలి

- అచ్చంపేటలో ప్రైవేట్ దవాఖానను తనిఖీచేసిన డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ తారాసింగ్




ప్రైవేట్ దవాఖానను తనిఖీచేస్తున్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో

అచ్చంపేట రూరల్, మే 3: నిబంధన ప్రకారం ప్రైవేట్ దవాఖానను నిర్వహించాలని లేనిచో చట్టపర మైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ తారాసింగ్ హెచ్చరించారు. పట్టణంలో ఆయన డాక్టర్ శివశంకర్‌తో కలిసి 9 దవాఖానలు, 5డయాగ్నోస్టిక్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్ తారాసింగ్ మాట్లాడుతూ.. డీఎం హెచ్‌వో స్వరాజ్యలక్ష్మి ఆదేశానుసారంగా శనివారం సాయంత్రం పలు క్లినిక్‌లను తనిఖీ చేసినట్లు చెప్పారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం నడుపుతున్నారా? లేదా అని వివిధ ధ్రువపత్రాలను పరిశీలించారు. బయో మెడికల్ వ్యర్థాలను సరైన పద్ధతిలో నిర్వహణ చేయాలని సూచించారు. ఐఈసీ మెటీరియల్ డిస్‌ప్లే అవుతున్నాయా లేదా అని పరిశీలించారు. ప్రజలకు సరైన మౌలిక వైద్యస దుపాయాలు కల్పించి అవసర మైన వైద్య పరికరాల నిర్వహణ చేయాలని సూచించారు.

### ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం

పెద్దకొత్తపల్లి, మే 3: మండలంలోని ముష్టిపల్లిలో శనివారం ఆంజనేయస్వామి, శివాలయం, చెన్నకేశవ ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కొల్లాపూర్ ప్రాంతం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే పదోతరగతి పరీక్షల్లో మండల ప్రథమస్థానం వచ్చిన గాజుల విజయ్‌కుమార్ విద్యార్థిని మాజీ ఎమ్మెల్యే బీరం శాలువాతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు బీఆర్‌ఎస్ నాయకులతో పాటు, మండల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

### కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

అచ్చంపేట, మే 3: బల్మూర్ మండలంలోని కొండనాగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ పరంగి రవి ప్రకటనలో తెలిపారు. దోస్త్ ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయని, కళాశాలలో మొత్తం 360సీట్లు ఉండగా అందులో బీఏ కోర్సులో 180సీట్లు, బీకాంలో 60సీట్లు, బీఎస్సీలైఫ్ సైన్స్ 60 సీట్లు, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ 60సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇంటర్‌పాసైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే క్రమంలో మొదటిప్రాధాన్యత కొండనాగుల డిగ్రీ కళాశాలను ఎంచుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య, మంచి అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, మంచి వాతావరణంలో తరగతులు కొనసాగుతాయని తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు పొందాలని సూచించారు.

### మెరుగైన వైద్య సేవలందించాలి..

కల్వకుర్తి రూరల్, మే 3: గ్రామీణ ప్రాంత చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సకాలంలో టీకాలను అందించి మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీడీఓ వెంకట్రాములు సూచించారు. శనివారం మండలంలోని లింగసానిపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వంశీతో కలిసి పర్యటించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీచేసి అనంతరం అంగన్‌వాడీ సందర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశలు తదితరులు ఉన్నారు.

### దరఖాస్తుల స్వీకరణ

కల్వకుర్తి, మే 3: ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ శర్వానీ తెలిపారు. ఉన్నత విద్యా మండలి శుక్రవారం దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేసిందని చెప్పారు. డిగ్రీ కళాశాలలో మొత్తం 480సీట్లు ఉన్నాయని, బీఏలో 180, బీకాంలో 120, బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో 120, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 120 సీట్లు ఉన్నాయని చెప్పారు.

### ఉపాధి హామీ పనుల పరిశీలన

పెద్దకొత్తపల్లి, మే 3: మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను శనివారం మండల అభివృద్ధి అధికారి నాగేంద్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి పనుల వద్ద కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రామాల్లో ఉపాధి హామీ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని, సంబంధిత అధికారులను కోరారు. అలాగే పని ప్రదేశాల్లో మౌళిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎండకాలంలో కూలీలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవోతో పాటు టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్స్ ఉన్నారు.

### బీఎల్‌వో డ్యూటీలు రద్దు చేయాలి

కల్వకుర్తి రూరల్, మే 3: అంగన్‌వాడీ ఉద్యోగులకు బీఎల్‌వో డ్యూటీలను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఆర్డీవో శ్రీనుకు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీలకు ఇతర పనులను పురమాయించడంతో తమ విధుల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బీఎల్‌వో డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నిర్మల, పద్మ, జ్యోతి, సునిత, సాహితి ఉన్నారు.

## జీవితానికి పనికొచ్చే పాఠాలు నేర్పడమే లక్ష్యం



మాట్లాడుతున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

కల్వకుర్తి రూరల్, మే 3: విద్యార్థులకు ఆనందం ఆహ్లాదంతోపాటుగా విజ్ఞానదాయకంగా సాంస్కృతికంగా ఉండే పాఠాలతో పాటుగా జీవితకాలానికి పని కొచ్చే పాఠాలను నేర్పించడమే బాలోత్సవ కమిటీ ముఖ్య లక్ష్యమని నిర్వాహకులు అన్నారు. శనివారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులను తెలుగు, ఇంగ్లిష్, గణితంతోపాటు పలు అంశాలలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి పలువురు హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.. టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండే విధంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా శిక్షణ పొందేవిధంగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో విద్యార్థులతో శిక్షణ ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థులలో దాగి సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రతిభావంతులుగా తీర్చడం కోసం బాలోత్సవ కమిటీ పనిచేస్తుందన్నారు. విద్యార్థులనుద్దేశించి ఏర్పాటుచేసిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ వాయిస్ ఎడిటర్ వెంకటేశ్వర్లు, ఏపీ మల్లయ్య, పరుశురాములు, చిన్నయ్య, నెహ్రూప్రసాద్, పద్మ, జంగయ్య ఉన్నారు.

### ఎక్సైజ్ అధికారుల దాడులు

అచ్చంపేట రూరల్, మే3: మండల కేంద్రంలోని హాజీపూర్ శివారులో శుక్రవారం తెల్లవారుజామున ఎన్‌ఫోర్స్‌మెంట్, మహబూబ్‌నగర్ సీఐ శారద ఆధ్వర్యంలో రూట్‌వాచ్ నిర్వహించగా నల్లబెల్లం, కారు సీజ్, వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన చోటుచేసుకున్నది. సీఐ శారద తెలిపిన వివరాలిలా.. మండలంలోని హాజీపూర్ చౌరస్తాలో అర్ధరాత్రి బొల్గట్‌పల్లికి చెందిన శివ యువకుడు ఇండిగో వాహనంలో 480 కేజీల నల్ల బెల్లం, 5కేజీల పటిక, 6లీటర్ల నాటుసారాను తరలిస్తు పట్టుబడ్డాడని ఆమె తెలిపారు. వాహనాన్ని సీజ్‌చేసి వ్యక్తిపై కేసున మోదు చేసి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఏఎస్సై సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

### ఆటో బోల్తా.. వ్యక్తికి గాయాలు

ఉప్పునుంతల, ఏప్రిల్3: మామిళ్లపల్లి-తెల్కపల్లి మధ్య శనివారం ఆటో బోల్తా పడగా మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన తాళ్ల నిరంజన్ తీవ్రంగా గాయపడినట్లు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు తెలిపారు. నిరంజన్ అనారోగ్యం రిత్యా తెల్కపల్లి దవాఖానకు మామిళ్లపల్లి వద్ద లక్ష్మాపూర్‌కు చెందిన ఆటోలో వెళ్తుండగా ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో రాకొండ సమీపంలో శివగంగ ఫంక్షన్‌హాల్ వద్ద బోల్తా పడింది. డ్రైవర్ పక్కన కుర్చున్న నిరంజన్‌పై ఆటో పడడంతో కాలుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కొందరు యువకులు 108లో నాగర్‌కర్నూల్ ఏరియా దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడిని మండల పార్టీ అధ్యక్షుడు రవిందర్‌రావు పరామర్శించారు.

### చెరువులో పడి బాలుడి మృతి

తిమ్మాజిపేట, మే 3: ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఆవంచలో చోటుచేసుకున్నది. ఏఎస్సై శ్రీనివాస్ వివరాల మేరకు.. ఎదిరేపల్లికి చెందిన సుశాంత్ (10) బాలుడు జడ్చర్ల హాస్టల్‌లో ఉంటు చదువుకుంటున్నాడని, గత నెలలో అతడి తల్లి తన సొంత గ్రామం ఆవంచకు తీసుకుపోయినట్లు తెలిపారు. అయితే మూడురోజుల కింద గ్రామ సమీపంలోని తుమ్మలమ్మకుంటలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఈ విషయం ఎవరూ గమనించకపోవడంతో అతడు మృతి చెందినట్లు తెలిపారు. అయితే అతడికి తండ్రి లేక పోవడంతో కుటుంబ సభ్యులు అతడి కోసం అన్ని చోట్ల వెతికినా ఫలితం లేక పోయింది. శనివారం ఉదయం బాలుడి మృతదేహం తేలడంతో స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం కోసం తరలించారు. బాలుడి తండ్రి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసున మోదుచేసినట్లు ఏఎస్సై తెలిపారు.

### పిడుగుపాటుకు కాడెద్దుల మృత్యువాత

అచ్చంపేటరూరల్, మే 3: మండలంలోని చెదురు బావితండాలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడి కొర్ర శంకర్‌కు చెందిన రెండు కాడెద్దులు మృత్యువాత పడిన ఘటన చోటుచేసున్నది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలిలా.. రాత్రి కురిసిన వర్షానికి పాటుకు గుర్రై రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మద్దెల రామనాథం స్థానికులతో కలిసి రైతు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు కేఆర్ శంకర్‌నాయక్, హతిరాంనాయక్, నాగరాజు, లాల్యానాయక్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

## నిజమైన లబ్ధిదారులకే ఇండ్లు



ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న అధికారులు

లింగాల, మే 3: నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు మండల ప్రత్యేకాధికారి అనిల్ అన్నారు. శనివారం మండలంలోని సూరాపూర్, కొత్తకుంటపల్లి గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లు లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి లలిత, సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిస్తాం

అచ్చంపేటరూరల్, మే 3: అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఐక్య ఉద్యమాలను కొనసాగిస్తామని సీపీఎం నాయకులు శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని సింగారంలో శనివారం బస్టాండ్ ఆవరణలో మేడే ఉత్సవాల ను నిర్వహించగా గ్రామ శాఖ కార్యదర్శి కొండెమోని బక్కయ్య పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ సర్పంచ్‌లు జర్పుల చంద్రునాయక్, కొండెమోని బాలింగయ్య, అంజనయ్య, బి.రాములు, కేతావత్ శ్రీనివాసులు, కోట్ల సత్యమయ్య పాల్గొన్నారు.



ఉత్సవాల్లో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

### 6నుంచి లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

తాడూరు, మే3: ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకులకు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈనెల 6నుంచి 9వరకు బ్యాంకుల వారీగా ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిచనున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. శానివారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఈ నెల 6నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు, 7న ఎస్‌బీఐ నాగర్‌కర్నూల్‌కు సంబంధించిన లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిచనున్నట్లు ఆయన తెలిపారు.

**బిజినేపల్లిలో..**

బిజినేపల్లి, మే 3: ఈ నెల 5 నుంచి 12వరకు రాజీవ్ యువ వికాస్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకుల వారీగా అన్ని కార్పొరేషన్ల ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహిచనున్నట్లు ఎంపీడీవో కథలప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బిజినేపల్లి సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తున్న దృశ్యం

### ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

- ఆర్డీవో మాధవి

అచ్చంపేటరూరల్, మే3: డివిజన్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో మాధవి అన్నారు. మండలంలోని హాజీపూర్ శివారులోని 62 సర్వే నంబర్‌లో ఉన్న ఐదు ఎకరాలపై చిలుకు ప్రభుత్వ భూమి రక్షణకు చర్యలు తీసుకోవడంలో భాగంగా ప్రభుత్వ భూమిని తెలుపుతూ ఆర్‌ఐ రాత్లవత్ బలరాం ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆర్‌ఐ రాత్లవత్ బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.

### సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

వెల్దండ, మే 3: మండలంలోని పోచమ్మగడ్డతండాకు చెందిన వడ్త్యావత్ సుక్లీ అనారోగ్యంతో బాధపడుతూ దవాఖాన ఖర్చుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కశిరెడ్డి యువసేన నాయకులు దుబ్బతండా శ్రీను సహకరించడంతో ప్రభుత్వం రూ.16500 మంజూరు చేసింది. శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

### సౌకర్యాలు కల్పించాలి

కొల్లాపూర్, మే 3: మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీపనుల వద్ద మౌళిక సౌకర్యాలను కల్పించాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జల్లాపూరం సురేందర్ సంబంధిత అధికారులను కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధిహామీ పని ప్రదేశాలలో చాలా వరకు టెంట్, మంచి నీళ్ల సౌకర్యం కల్పించడం లేదన్నారు. ఎండలో ఎక్కువ సమయం పని చేయించడంతో పాటు కూలీలకు కష్ట మైన పని కల్పించి కొలతల విషయంలో తేడాలను నమోదు చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఉపాధిపనులు జరిగే ప్రదేశాలను సంబంధిత ఉన్నతాధికారులు తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు.

### సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ, మే 3: మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఝాన్సీరాణి, జీహెచ్‌ఎం భగవాన్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని చారకొండ, జూపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేసవి క్యాంప్‌లో విద్యార్థులకు యోగా, కరాటే, వినోదాత్మక కార్యక్రమాలు, గణిత ఫార్ములాలు తదితర అంశాలపై అవగాహ కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 5నుంచి పాటు శిక్షణ ఉంటుందని, 6-10వ తరగతుల విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

### జీసీసీ మేనేజర్, అకౌంటెంట్ సస్పెన్షన్

అచ్చంపేట, మే 3: అమ్రాబాద్ మండలం మన్నూర్ గిరిజన సహకారం సంస్థ మేనేజర్ సంతోష్‌కుమార్, అకౌంటెంట్ రూప్లను గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ సస్పెన్షన్ విధిస్తూ శనివారం ఆదేశాలు జారీచేశారు. జీసీసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ గిరిజన వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలకు నిత్యావసర సరుకులు పంపిణీచేస్తారు. అయితే జీసీసీ సరుకులు సరఫరాకోసం టెండర్లు పిలిచి మర్చంట్ల ద్వారా సరుకులు సరఫరా చేస్తారు. అయితే మేనేజర్ మర్చంట్ల ద్వారా కాకుండా నేరుగా సరుకులు కొనుగోలు చేసి అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై గిరిజన శాఖ కమిషనర్ విచారణ చేశారు. అనంతరం మేనేజర్ సంతోష్‌కుమార్, అకౌంటెంట్ రూప్లలను సస్పెండ్ చేసి డీటీడీవో ఫీరంగికి ప్రస్తుతం అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గిరిజన శాఖ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

### నిధులు దుర్వినియోగం



వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

నాగర్‌కర్నూల్ రూరల్, మే 3: మండలంలోని పెద్దముద్దునూర్ గ్రామపంచాయతీలో స్వచ్ఛభారత్ మిషన్ పథకంలో భాగంగా నిర్మించిన మరుగుదొడ్ల నిధులను పంచాయతీ సెక్రటరీ, అధికార పార్టీ నాయకులు లబ్ధిదారులకు చెల్లించకుండా దుర్వినియోగం చేశారని శనివారం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయం గురించి ఎంపీడీవో కోటేశ్వర్‌తో ప్రస్తావించగా గతంలో ఉన్నపంచాయతీ సెక్రటరీ బదిలీ అయ్యారని అప్పుడున్న పంచాయతీ సెక్రటరీని పిలిపించి విచారిస్తామని సూచించారు. లబ్ధిదారుల యొక్క డబ్బులు అక్రమంగా వాడుకున్నట్లు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు.

### తైబజార్ వేలం

లింగాల, మే 3: మండల కేంద్రమైన లింగాల మేజర్ పంచాయతీకి తైబజార్ వేలం పాటతో రూ.4, 61లక్షలు వచ్చింది. పంచాయతీ కార్యాలయంలో శనివారం మండల ప్రత్యేకాధికారి అనిల్ ఆధ్వర్యంలో తైబజార్ వేలం నిర్వహించారు. మొత్తం 17మంది డిపాజిట్ చెల్లించి తైబజార్ వేలంలో పాల్గొన్నారు. మండలానికి చెందిన తిప్పరాజు రవికుమార్ రూ.4,61లక్షలు పాటపాడి తైబజార్ వేలాన్ని దక్కించుకున్నట్లు మండల ప్రత్యేకాధికారి అనిల్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరి రామకృష్ణ, నాయకులు రాజు, ఇందిరమ్మ, విజయలక్ష్మి, వెంకటయ్య, శ్రీశైలం, శ్రీను పాల్గొన్నారు.

### సదస్సులను వినియోగించుకోవాలి

పెంట్లవెల్లి, మే 3: మండలంలోని రైతులు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తాసీల్దార్ జయసింహ శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నెల 5న సింగవరం, మల్లేశ్వరం, 6న వెంకల్, గోప్లాపూర్, 7న మంచాలకట్టా, జటప్రోల్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో భూ సమస్యలపై దరఖాస్తులను ఇవ్వాలని పేర్కొన్నారు.